నవతెలంగాణ 1
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
మంగళవారం | 23 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

పోలీసుల తనిఖీల్లో రూ.60 వేల నగదు సీజ్



నవతెలంగాణ-కొమురవెల్లి

మండలంలోని ఐనాపూర్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీల్లో భాగంగా పట్టుబడిన రూ. 60 వేల నగదు ను సీజ్ చేసినట్టు చేర్యాల సిఐ ఎల్ శ్రీను తెలిపారు. ఎస్ఐ నాగరాజు సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మద్దూరు మండలం తోర్నాల గ్రామానికి చెందిన యాదగిరి తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 60 వేల నగదును తీసుకెళ్తున్నారని చెప్పారు. రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకొని వెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



నవతెలంగాణ-దుబ్బాక

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండల పరిధిలోని హబ్సీపూర్ శివారులో ఆదివారం రాత్రి జరిగింది. దుబ్బాక ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్ పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన చీమిడి బాలరాజు (45) దుబ్బాకలోని మిషన్ భగీరథ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి హబ్సీపూర్ శివారులో సిద్దిపేట- రామాయంపేట రహదారిలో గల కల్వర్టు వద్ద గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీకొనగా బాలరాజు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దారిలో వెళ్తున్న వ్యక్తులు మృతుడి వద్దనున్న ఐడి కార్డులను చూసి అతడి భార్య సువర్ణకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఏరియా 100 పడకల ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి సేవలను పెంచాలి

నవతెలంగాణ-నంగునూరు

స్థానిక ప్రభుత్వాసుపత్రిలోనే నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందేలా ఓపి సేవలను పెంచాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం నంగునూరు మండలం రాజగోపాల్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదమున్నందున వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించి వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, సీజనల్ వ్యాధులపై గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలతో పాటు తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎంహెచ్ఓ వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ నాయక్, ఏవో రవీందర్ రెడ్డి, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.



వేసవి తాపానికి.. తాటిముంజలు

- చల్లదనంతో పాటు ఆరోగ్యమూ..
- గ్రామాలతోపాటు పట్టణాల్లోనూ విరివిగా దొరుకుతున్న తాటిముంజలు

నవతెలంగాణ-జహీరాబాద్

వేసవికాలం వచ్చిందంటే కర్బూజా, హంగూర్, పైన్‌ఆపిల్, మామిడి, పుచ్చకాయ, జామ ఇలా అనేక రకాల పండ్లు నోరూరిస్తుం టాయి. చాలామంది వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు పుచ్చకాయ, ఖర్బూజా తినడానికే ప్రాధాన్యత ఇస్తారు. అయితే వేసవిలో అత్యంత చలువ చేసేది.. ఈ కాలంలో మాత్రమే దొరికేది తాటి ముంజలు. తాటి చెట్లు ఎండాకాలంలో మాత్రమే ఎక్కువగా కాస్తాయి. కాబట్టి ముంజలు విరివిగా దొరుకుతుంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో నగరాల్లోనూ పెద్ద ఎత్తున తాటి ముంజలు దొరుకుతున్నాయి. కాబట్టి ఆరోగ్యప్రియులు తాటిముంజలు తినాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు.




తాటిముంజలు ఎందుకంత ప్రత్యేకం..

తాటిముంజలు శరీరాన్ని శుభ్ర పరుస్తాయి. వీటిలో విటమిన్ ఎ, బి, సి, ఐరన్, జింక్, పాస్పరస్, పొటాషియం వంటి ఖనిజ అవణాలుంటాయి. ఇవి శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతాయి. దాంతో శరీరం శుభ్రమవుతుంది. బరువు కూడా తగ్గుతారు. ముంజల్లో నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల కొద్దిగా తిన్నా పొట్ట నిండినట్లుగా అనిపిస్తుంది. దీంతో త్వరగా ఆకలి వేయదు. బరువు తగ్గాలనుకునే వారికి ఇవి మంచి ఆహారం. జీర్ణక్రియ మెరుగు చేయడంతో పాటు, శరీరాన్ని చల్లబరిచే గుణం ఉండటంతో వేసవిలో తాటిముంజలు ఎంతోమేలు చేస్తాయి. ఎండ వల్ల కలిగే అలసట, నీరసాన్ని దూరం చేస్తుంది. మలబద్ధకం సమస్యను నివారించడంలో ముంజలు బాగా పనిచేస్తాయి. వీటిని తరుచూ తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి అజీర్తి, ఎసిడిటీ తగ్గుతుంది. మొటిమలను తగ్గించ డంలోనూ ముంజలు బాగా పనిచేస్తాయి. గర్భిణులకు ఇవి ఎంతో మేలు చేస్తాయి. ఆరోగ్యానికి ఎంతోమేలు చేసే తాటిముంజలను తినడం మిస్ కావొద్దని నిపుణులు చెబుతున్నారు.

పేదలకు ఉపాధి..

తాటిముంజల విక్రయంతో చాలామంది పేదలకు ఉపాధి దొరుకున్నది. గ్రామాల్లో విరివిగా దొరికే తాటి ముంజలను కొనుగోలు చేసి.. పట్టణాలకు తరలిస్తుంటారు. అక్కడ విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఏడాదికొకసారి వేసవిలో ఇలా తాటిముంజలను విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని వారు చెబుతున్నారు.

తాటిముంజల వినియోగం మంచిదే..



తాటిముంజల్లో అనేక రకాల ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ఎండా కాలంలో వీటిని తినడంతో.. శరీరంలో అనేక రకాల వ్యాధుల నిర్మూలనకు దోహదపడతాయి. విరివిగా కాకుండా రోజుకు ఒకటి లేదా రెండు చొప్పున మాత్రమే తీసుకోవాలి. షుగర్ వ్యాధిగ్రస్తులు తీసుకునే ముందు వైద్యుల సలహాలు సూచనలు పాటించాలి.

- డాక్టర్ శివబాబు



సురేష్ షెట్కర్‌కు మెజార్టీ కోసం కృషి చేయాలి

నవతెలంగాణ-జోగిపేట

జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కర్ కు మెజార్టీ కోసం కృషి చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. సోమవారం ఆందోల్ నియోజకవర్గం పర్యటనలో భాగంగా అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆందోల్-జోగిపేట మున్సిపాల్టీ పరిధిలో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్ కు భారీ మెజారిటీ వచ్చేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ముఖ్య నాయకులందరూ సమన్వయంతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలని కోరారు. ప్రతీ ఓటర్‌ను కలిసి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, 6 గ్యారంటీల అమలు పై ప్రజలకు వివరించాలని మంత్రి కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆందోల్ - జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు ఎస్. సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, డి. శంకర్, రంగ సురేష్, హరికృష్ణ గౌడ్, కే. నాగరాజు, దుర్గేష్, చందర్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అల్లే శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాకూరి వెంకటేశం, పట్లోళ్ల ప్రవీణ్, ప్రదీప్ గౌడ్, తాటికొండ శ్రీధర్, డాకూరి శ్రీనివాస్, శరత్ బాబు, చిట్యాల మధు, రాజశేఖర్, ఉలవల సతీష్, సత్యవత్, గుర్రం కృష్ణ, సత్యం, పట్లోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు రోడ్ షో

నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని దుద్దెడ, కొండపాక గ్రామాలలో సోమవారం సాయంత్రం బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కల్లబొల్లి మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలను కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే పార్లమెంటులో పేద బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన వానిని వినిపిస్తానని తెలిపారు. మోడీ నాయకత్వంలో తాను పనిచేసి దేశ సేవకునిగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ సురేష్ షెట్కర్

నవతెలంగాణ-కల్హేర్

నిజాంపేట మండలంలోని బాచేపల్లి గ్రామానికి చెందిన బుచ్చయ్య కుమారుడి వివాహం సోమవారం జరిగింది. ఈ వివాహ వేడుక కార్యక్రమానికి జహీరా బాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ సురేష్ కుమార్ సెట్కార్ హాజరై నూతన వధూవరులు ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీపీ మలేశం, నిజాంపేట మండలాధ్యక్షులు శంకర్‌గౌడ్, కల్హేర్ మండలాధ్యక్షులు పొచన్న, మాజీ సర్పంచ్ గోపాల్, దేవిదాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీజేపీకి ఓటు అడిగే హక్కు లేదు

- మెదక్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయం ఖాయం
- రెండో స్థానం కోసం కాంగ్రెస్, బీజేపీల ఆరాటం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-నర్సాపూర్

రైతులను మోసం చేసిన బీజేపీకి తెలంగాణలో ఓటు అడిగే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని చాముండేశ్వరి కళ్యాణ మండపంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాని అంబానీలకు మేలు జరిగింది తప్ప, పేద సామాన్య ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయకుండా బీసీలను మోసం చేసిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ చిల్లర రాజకీయాలకు పాల్పడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తుందన్నారు. వెంకట్రామిరెడ్డి డబ్బులు సంపాదించుకోవడానికి రాజకీయాల్లోకి రాలేదని ప్రజలకు సేవ చేసేందుకు వచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా మోసం చేసిందని మాదిగలు కాంగ్రెసును ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు కులాల, మతాల పేరుతో ముందుకు వస్తున్నారని అటువంటి పార్టీలను నమ్మవద్దన్నారు. మెదక్ పార్లమెంటు స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని, కాంగ్రెస్ బీజేపీలు రెండవ స్థానం కోసం పోటీ పడుతున్నాయన్నారు. మెదక్ పార్లమెంట్‌పై బీఆర్ఎస్ జండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్,శ జడ్పి కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మాజీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి, నాయకులు గోపి, నర్సింలు, రమేష్ నాయక్, సూరారం నరసింహులు, సత్యం గౌడ్, గొర్రె వెంకట్ రెడ్డి, షేక్ హుస్సేన్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





బీరప్ప స్వామి జాతరలో పాల్గొన్న నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్

ఝరాసంఘం మండలంలోని గుంతమర్పల్లి గ్రామంలో జరుగుతున్న బీరప్ప స్వామి జాతర మహోత్సవంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం పాల్గొని బీరప్ప స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాల్లో మాజీ సర్పంచ్ శంకర్, కేతకి ఆలయ మాజీ చేర్మెన్ నర్సింహగౌడ్, నాయకులు మాణిక్ ప్రభు గౌడ్, జనార్దన్ రెడ్డి,చెంగల్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి

- కొమురవెల్లి, చేర్యాల మండలాల్లో సీపీఐ(ఎం) నాయకుల ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-కొమురవెల్లి

పార్లమెంట్‌కు జరుగుతున్న ఎన్నికల్లో మతోన్మాద, అవకాశ వాద పార్టీలను ఓడించి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న సీపీఐ(ఎం) పార్టీని గెలిపించాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల నిరుద్యోగం, పేదరికం, పెరిగి పోయాయని, మతోన్మాద విధానాలతో ప్రజలను విడదీస్తూ దేశ లౌకిక తత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న మతోన్మాద రాజకీయాలను ఓడించాలని పిలుపునిచ్చారు. దేశం వెనుకబడటానికి కారణమైన కాంగ్రెస్ అవకాశ వాద రాజకీయాలు చేస్తూ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుందని తెలి పారు. బీఆర్ఎస్ గత పదేండ్లుగా నియంతృత్వంగా వ్యవహరించిందని ఫలితంగా ప్రజలు విస్మరించారని, ఎలాంటి చరిత్ర లేని వ్యక్తులు అభ్యర్థులుగా పోటీకొస్తున్నార న్నారు. నీతి, నిజాయితీ పోరాటాల వారసత్వం కలిగిన సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు స్థానంలో పోటీ చేస్తుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో మతోన్మాద, అవకాశ వాద రాజకీయాలు చేస్తున్న పార్టీలను తిరస్కరించాలని, పదవుల కోసం పార్టీలను మారి అనైతికంగా వ్యవహరిస్తున్న వారిని చిత్తుగా ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, అత్తిని శారద, నాయకులు ఆరుట్ల రవీందర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.





చేర్యాల : కష్ట జీవుల పక్షాన నిరంతరం పోరాడుతున్న సీపీఐ (ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ సోమవారం మండల పరిధిలోని చుంచన కోట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ అనునిత్యం పేద ప్రజల కోసం సీపీఐ(ఎం) పోరాడుతుందని తెలిపారు. ఎన్నికల ముందు వివిధ పార్టీల అభ్యర్థులు ఆరిద్ర పురుగుల వలె వస్తారని గెలిచాక కనిపించకుండా పోయి స్వలాభం కోసం పార్టీలు మారుతున్నారన్నారు. పీడితుల పక్షాన పోరాటం చేస్తున్న జహంగీర్‌ను గెలిపించి పార్లమెంటుకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాటికొండ రవి, మండల నాయకులు గొర్రె శ్రీనివాస్, రమేష్, ఆముదాల రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పిడుగుపాటుతో మహిళ మృతి

నవతెలంగాణ-కల్హేర్

గొర్రెలు, మేకలు మేపడానికి వెళ్లిన దంపతులు అకస్మాతు వర్షానికి తలదాచుకోవడానికి ఓ చెట్టుకింద నిలుచోగా.. ఒక్కసారిగా ఆ చెట్టుపై పిడుగు పడడంతో భార్య అక్కడికక్కమే మృతి చెందింది. ఈ ఘటన కల్హేర్ మండలంలోని మాసన్ పల్లి గ్రామ శివారులో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసన్‌పల్లి గ్రామానికి చెందిన రేణుక(32), మల్లేష్ దంపతులు సోమ వారం రోజువారీ లాగే తమ గొర్రె, మేకలు మేపడానికి వెళ్లారు. అయితే ఆకస్మాత్తుగా ఈదురు గాలులు, ఉరుము మెరుపులతో కూడిన వర్షం పడటంతో తలదాచుకునేందుకు చెటు కింద నిలబడ్డారు. వారు నిలుచున్న చెట్టుపై పిడుగు పడడంతో భర్త మల్లేష్ ప్రాణాలతో బయటపడగా.. రేణుక అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు, తోటి కాపర్లు, గ్రామస్తులు, పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు



వికాస్ గ్రామర్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-చేర్యాల

ఫీజు కట్టలేదని విద్యార్థులను ఎండలో నిలబెట్టిన వికాస్ గ్రామర్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాల పట్టణ కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం రాకేష్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ ఫీజు కట్టలేదని ఎండలో నిలబెడుతూ పరీక్ష రాయనీయకుండా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఫీజు కట్టకపోతే స్కూల్‌కు రావొద్దు అంటూ ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. వారం రోజుల క్రితం విద్యార్థి బస్సు ఫీజు కట్టలేదని వారి గ్రామంలో స్కూల్ బస్సులో ఎక్కించుకోకుండా రోడ్డు మీదనే విద్యార్థిని వదిలేసి బస్సు వెళ్లిపోయిందని తెలిపారు. ఫీజుల కోసం ఇబ్బందులకు గురి చేస్తున్న వికాస్ గ్రామర్ స్కూల్‌పై ఎంఈఓ స్పందించి స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు నితిన్, హరి, శివ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి ఎంపీపీ రాజీనామా.!



నవతెలంగాణ-మిరుదొడ్డి

దళిత ఎంపీపీ అయినందుకే రెడ్డి అగ్రవర్ణ నాయకులు రాజకీయంగా జీర్ణించుకోలేకపోతున్నారని ఎంపీపీ గజ్జల సాయిలు అన్నారు. కొంతమంది బీఆర్ఎస్ పార్టీలో అగ్రవర్ణ నాయకులు ఎంపీపీ చేస్తున్న పనులకు ఓర్వలేక పోతున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపొందిన నాటి నుంచి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ గజ్జెల సాయిలు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాలకు పిలువకుండా అవమానపరుస్తున్నారన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సైతం రెడ్డి వర్గానికి చెందిన వారు కావడంతో తాను దళిత ఎంపీపీ కావడం వల్ల ఇలా అవమానాలకు గురి చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీలో దళితులకు స్థానం కరువైందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు తెలిపారు.

టీఆర్ఎస్ నుంచి ఎంపీ బరిలో తుపాకుల మురళి

- మెదక్ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు కుమారుడు పోటీ

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఎన్నికల ఊపు, హీట్ పెరుగుతున్న వేళ మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి టిఆర్ఎస్ (తెలంగాణ రాజ్య సమితి) అభ్యర్థిగా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలకు చెందిన తుపాకుల మురళి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. కొన్ని నెలల క్రితం సిద్దిపేట అర్బన్ మండలం, పొన్నాల గాంధీ నగర్‌కు చెందిన తుపాకుల బాల్ రంగం టిఆర్ఎస్ (తెలంగాణ రాజ్యసమితి పార్టీ)) పేరిట గుర్తింపు కావాలని ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు పెట్టుకున్నారు. ఆ తర్వాత ఆ దరఖాస్తును గుర్తిస్తూ తెలంగాణ రాజ్యసమితి పేరిట గ్యాస్ సిలిండర్ గుర్తును కేటాయిస్తూ ఎన్నికల కమిషన్ అనుమతులు ఇచ్చింది. అప్పటి నుండి ఆ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా బాల్ రంగం కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన తుపాకుల మురళి కూడా పార్టీలో రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. తుపాకుల మురళి తమ్ముడి భార్య బిఆర్ఎస్ సిద్దిపేట అర్బన్ మండల జడ్పిటిసిగా ప్రస్తుతం కొనసాగు తున్నారు. తుపాకుల బాల్ రంగం కూడా ఇంకా బీఆర్ఎస్ సభలకు హాజరవుతూనే టిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడుగా పదవులు నిర్వహిస్తున్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్‌తో స్నేహపూర్వక మద్దతు ఉంటుందని ప్రకటించి ప్రస్తుతం ఎంపీ అభ్యర్థిగా మెదక్ నుంచి తన కుమారుడిని బరిలోకి దింపడంతో రాజకీయంలో ఆసక్తికరమైన చర్చ మొదలైంది.



కాంగ్రెస్‌లోకి అమర్నాథ్..

నవతెలంగాణ-కోహిర్

కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీమంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మనీఆర్‌పల్లి గ్రామానికి చెందిన అమర్నాథ్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రామలింగ రెడ్డి, వైస్ ఎంపీపీ షాకీర్ అలీ, ఎంపీటీసీ రత్నం, నాయకులు ముర్తుజా, మధు, ప్రవీణ్ కుమార్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



దుకాణ యాజమానిని హత్య చేసిన కూలీలు

- చికెన్ దుకాణం యజమాని కాళ్లను వైర్‌తో కట్టేసి హత్య
- జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఘటన



నవతెలంగాణ-జగదేవపూర్



డబ్బుల కోసం దుకాణ యాజమానిని హత్య చేసిన సంఘటన జగదేవపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకు ంది. తూప్రాన్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రాంరెడ్డి చికెన్ సెంటర్ యజమాని మహిపాల్ రెడ్డి (40) జగదేవపూర్ మండల కేంద్రంలో గల వినాయకుని గుడి వీధిలో సుమారు 18 నెలల నుంచి చికెన్ దుకాణం నడిఎస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఆదివారం సాయం త్రం దుకాణంలో పని చేసే కూలీలు మహిపాల్‌రెడ్డిని హత్య చేసి పారిపోయారు. స్థానిక ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం సమయంలో దుకాణం వెనకాల గల గదిలో హత్య చేశారు. దుకాణంలో పని చేసే కూలీలు బీహార్‌కు చెందిన కురాబాల్, రూబల్ అనే యువకులు హత్య చేసి పారిపోయినట్లు ఎస్ఐ తెలిపారు. సీసీ టివి డివిఆర్‌ను కూడా వైర్ కత్తిరించారు. సాయంత్రం సమయంలో మహిపాల్ రెడ్డి భార్య మానస ఒక దావత్‌కు వెళ్ళడానికి రమ్మనగా తనకు చికెన్ ఆర్డర్ ఉందని సోమవారం ఉదయం వస్తానని మహిపాల్‌రెడ్డి తన భార్యతో తెలిపారన్నారు. మళ్ళీ రాత్రి సమయంలో రోజు మాదిరిగానే ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని రావడంతో మహి పాల్ రెడ్డి భార్య తన బంధువులకు చెప్పింది. వాళ్ళ కూడా దుకాణంలో పని చేసే కురాబాల్, రూబల్‌లకు ఫోన్ చేయగా వారి ఫోన్‌లు కూడా స్విచ్‌ఆఫ్ రావడం తో ఎదు రుగా ఉన్న కొండల్‌కు ఫోన్ చేసి అడగగా దుకాణం మూసి ఉందని సమాచారం అందించారు. సోమవారం ఉదయమే జగదేవపూర్ వచ్చి దుకాణం షెట్టర్ లేపి లోపలికి వెళ్లగా లోపలి గదిలో ఒక మూలన దుప్పట్లు ఉన్నాయి. వాటిని తీయగా అందులో మహిపాల్ రెడ్డి మృతదేహం కనిపిం చడంతో ఆందోళనకు గురై వెంటనే పోలీసులకు సమాచా రాన్ని అందించినట్లు తెలిపారు. అక్కడికి చేరుకున్న పోలీసు లు కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సంఘటన స్థలంలో గల ఆధారాలను క్లూస్ టీంతో పరిశీలించారు. దుకాణం క్యాష్ కౌంటర్ తీసి టేబుల్‌పై పెట్టి ఉంది. మెషిన్ చెక్ చేయగా ఆదివారం సుమారు రూ.18 వేల గిరాకీ అయినట్లు తెలిసింది. డబ్బుల కోసం దుకాణ ంలో పని చేసే వారే ఈ హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దరా ్యప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్నీ పోస్ట్‌మార్టం నిమి త్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వివాహ వేడుకలో పాల్గొన్న ప్రముఖులు

నవతెలంగాణ-కల్హేర్



నిజాంపేట గ్రామంలోని బాచేపల్లి గ్రామానికి చెందిన బుచ్చయ్య కుమారుని వివాహం సోమవారం జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నాగేష్ షేట్కర్, పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్, సభ్యులు శంకరయ్యస్వామి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిజాంపేట మండలంలోని రాంరెడ్డి పేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకట్ రాములు కుమారుని వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోచాన్న, దేవిదాశ్,నర్సింలు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీకాంత్, ఎంపీటీసీ కృష్ణ, సీనియర్ నాయకుడు సాయిబాబా, గంగారం పాల్గొన్నారు.

గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్



పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. న్యాల్కల్ మండలంలోని హుస్సేన్‌నగర్, అమీరాబాద్ మూర్తజాపూర్, కాకిజన్వాడ, చాల్కి, ఉన్నాపూర్, గ్రామాల్లో ఎన్నికల సమన్వయకర్త దేవి ప్రసాద్, నాయకులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే ప్రచారం చేశారు. గాలి అనిల్‌కుమార్‌ను గెలిపిస్తే మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తావని వివరించారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రవీందర్, నాయకులు భాస్కర్, ప్రవీణ్, భూమారెడ్డి, రాజు పటేల్, ఉమేష్, కార్యకర్తలు ప్రజలు ఉన్నారు.



ఐదో రోజు ఏడు నామినేషన్లు

నవతెలంగాణ-సంగారెడ్డి

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఐదోరోజైన సోమవారం ఏడు నామినేషన్‌లు దాఖలైయ్యాయని జహీరాబాద్ రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. బీజేపీ అభ్యర్థిగా బిబి పాటిల్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా గంగారాం ఒక సెట్, టీపీఎస్ పార్టీ అభ్యర్థి గా కొత్త బలిజ బస్వారాజ్ రెండు సెట్లు , స్వతంత్ర అభ్యర్థి గా రమేష్ సజ్జపూర్ ఒక సెట్, పిరమిడ్ పార్టీ ఇండియా అభ్యర్థిగా మాలేపు మోహన్ రెడ్డి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి గారవి మహాదేవ్ స్వామి రెండు సెట్స్, జాతీయ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరపున మనీష్ కువార్ పాటిల్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను కలెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఓ కార్యాలయంలో అందజేశారన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబంధించిన ఆస్తులు, అప్పులు, నేరచరిత్ర వివరాలను ఎప్పటికప్పుడు సంగారెడ్డి రిటర్నింగ్ అధికారి నోటీసు బోర్డుపై ఉంచడంతో పాటు ఎన్నికల కమీషన్ అధికారిక వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతున్నదన్నారు. affidavit.eci.gov.in ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలను తెల్సుకోవచ్చు అన్నారు.



మృతిని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-న్యాల్‌కల్

అత్నూర్ గ్రామ మాజీ సర్పంచ్ సిద్ధరామ్‌రావు పాటీల్ ఇటీవలే మృతి చెందాడు. ఈ విషయం తెల్సుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు సోమవారం మృతుని కుటుంబాన్ని అత్నూర్ గ్రామంలో పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటామని ధైర్యం నింపారు. ఆయన వెంట జహీరాబాద్ సమన్వయకర్త దేవి ప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రవీందర్, భాస్కర్, ప్రవీణ్, సంగ్రామ్ పాటిల్, రవికుమార్, వడ్డీ సంగమేష్ తదితరులు ఉన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నవతెలంగాణ-కల్హేర్

నిజాంపేట మండలంలోని రాంరెడ్డిపెట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకట్ రాములు కుమారుడి వివాహం సోమవారం ఘనంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, సాయిబాబా, గంగారం, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కోహిర్

మండలంలోని బిలాల్పూర్, మనియార్పల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బీజేపీ ఎంపీ అభ్యర్థి బి.బి పాటిల్ ఆధ్వరంలో సోమవారం బీజేపీలో చేరారు. అదేవిధంగా మనీయర్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీ టీసీ జగన్నాథ్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ మండలాధ్యక్షులు వైద్యనాథ్, ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఆధ్వర్యంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, శివారెడ్డి,రాజు,స్వామి, నాగనతరావు, నాగరాజ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటేస్తే బూడిదలో పోసిన పన్నీరే..



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి బూటకపు మాటలతో, అమలు కాని హామీలతో, ప్రజలను ప్రలోభాలకు గురి చేయడానికి బీఆర్ఎస్ సిద్ధమవుతున్నదని.. ఈ విషయాన్ని ఓటర్లు గమనించి బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, కౌన్సిలర్ గోపాలమ్మ అన్నారు. గత పదేండ్ల నుంచి బొల్లారం మున్సిపాల్టీ అభివృద్ధికి గత ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఒక్క రూపాయి నిధులు కూడా వెచ్చించింది లేదన్నారు. అలాంటిది ప్రస్తుతం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి బొల్లారానికి వచ్చి ఎలక్షన్ ప్రచారంలో పాల్గొనడం నిజంగా బాధాకరమన్నారు. కపట ప్రేమ చూపించి బీఆర్ఎస్‌కు ఓటేయండి అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన వెంకట్రామిరెడ్డి బొల్లారం మున్సిపల్‌లో పర్యటించి కార్యకర్తలను ఓటర్లను ప్రలోభ పెట్టడం సిగ్గుచేటన్నారు. బొల్లారం మున్సిపల్ ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి నీలం మధుని ఎంపీగా గెలిపించాలని కోరారు. వచ్చే ఐదేళ్లలో ప్రతీయేడు రూ.50 లక్షల నుంచి కోటి రూపాయలు నిధులు బొల్లారం మున్సిపల్‌కు వచ్చే విధంగా నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, బొల్లారం మున్సిపాల్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేస్తామన్నారు.

పకడ్బందీగా చెక్‌పోస్ట్‌లు నిర్వహించాలి

- ఎలాంటి అక్రమ రవాణాకు తావివ్వొద్దు
- మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో ఎస్పీ రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి



రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా తమ తమ పోలీసు స్టేషన్ పరిధిలో చెక్ పోస్టులు నిర్వహించి.. ఎలాంటి అక్రమ రవాణాకు తావు లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఓటర్లను మభ్యపెట్టకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఓటర్లను చైతన్య పరచాలన్నారు. మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్‌లో భాగంగా సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ (అండర్ ఇన్వెస్టిగేషన్) లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్స్ నేరస్తులను పిటి వారెంట్ ద్వారా కోర్టు లో ప్రవేశపెట్టి సైబర్ బాధితులకు భాసత్యగా నివాలని సూచిం చారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్ లో వుండా లని, గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి అనే విషయాలపై తగు సలహాలు, సూచనలు చేశారు. ప్రతీ కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసి భాదితులకు అండగా నిలవాలని సూచించారు. అలాగే ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున.. సామాన్య ప్రజానికానికి ఇబ్బందులు కలిగించే విధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. కేడీ, సస్పెక్ట్‌ల కదలికలపై నిఘా వుంచి, అలవాటు పడిన నేరగాళ్లను, గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన వారిని సత్:ప్రవర్తన కోరుతూ ముందస్తుగా బౌండ్ ఓవర్ చేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల ఆన్లైన్, మోసాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతీ ఒక్క పోలీసు అధికారి తమ ఏరియాలో గల పోలింగ్ లోకేషన్స్, రూట్ మొబైలు గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నేర నియంత్రణతో పాటు, జరిగిన నేరాలను చేధించడంలో సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ, స్వచ్ఛంధంగా వారి గ్రామాల్లో, ప్రధాన కూడళ్లల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించా లన్నారు. జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ప్రజాప్రతినిధులు వ్యాపారస్తులు వివిధ కుల సంఘాలవారు ముందుకు రావాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడ తాయన్నారు. హైవేలు, ప్రధాన కూడళ్లలో, పార్కింగ్ ప్రాంతాలలో, పెట్రోల్ పంపులలో, ధాబాల్లో సి.సి. కెమెరాల ఏర్పాటు చేసుకునేల సంభందిత యజ మానులకు తెలియజేయాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, పటాన్ చెర్వు డీఎస్పీ రవీందర్ రెడ్డి, జహీరాబాద్ డీఎస్పీ రామ్ మోహన్ రెడ్డి, నారాయణ ఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, యస్.బి ఇన్‌స్పెక్టర్ మల్లేశం, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎలెక్షన్ సెల్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, జిల్లా ఇన్‌స్పెక్టర్స్, సబ్- ఇన్‌స్పెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.



బి.బి పాటిల్ నామినేషన్ కార్యక్రమానికి తరలిన నాయకులు

నవతెలంగాణ-న్యాల్‌కల్

జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బి.బి పాటిల్ నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సంగారెడ్డిలో సోమవారం బి.బి పాటిల్ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా తనకు మద్దతుగా తరలివచ్చిన వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ మరోసారి అధికారంలోకి రావడానికి.. తనను ఆశీర్వదించి గెలిపించాలని నాయకులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. తరలివెళ్లిన వారిలో ఏక్నాథ్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, రాము, పాండు, నరసింహులు, తదితరులు ఉన్నారు.

నేడు డాకూర్‌లో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని డాకూరు రైతు వేదిక వద్ద నేడు(మంగళవారం) రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని మండల వ్యవసాయ అధికారి విజయరత్న తెలిపారు. వరిలో నేరుగా విత్తే పద్ధతి గురించి వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి. రంజిత హాజరై వివరిస్తారన్నారు. అనంతరం వరిలో నేరుగా విత్తే పద్ధతిలో సాగు చేస్తున్న సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి రైతు సుధాకర్ రెడ్డి తన అనుభవాలను పంచుకుంటారన్నారు. తర్వాత నేరుగా వరి విత్తనం విద్య పద్ధతి గూర్చి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రూపొందించిన వీడియోలు ప్రదర్శిస్తారన్నారు. అనంతరం మామిడి పండ్ల సాగులో పండుఈగ యాజమాన్య పద్ధతుల గూర్చి మరియు మామిడి పండు కోత మరియు కోత అనంతరం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గూర్చి అశ్వరావుపేట ఉద్యానవన కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ విజయకృష్ణ మాట్లాడుతారన్నారు. తదనంతరం వివిధ జిల్లాలకు చెందిన సాగు సమస్యలు, సందేహాల గూర్చి శాస్త్రవేత్తలతో చర్చ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలకు పాతరేసిన రేవంత్ సర్కార్

- సమన్వయంతో పని చేద్దాం.. వెంకట్రామిరెడ్డికి రికార్డు మెజారిటీ అందిద్దాం
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు

తెలంగాణ ప్రజలు ఎంతో నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి అధికారం అందిస్తే.. ఐదు నెలల పాలనలో సంక్షేమ పథకాలకు పాతర వేస్తూ.. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆరోపించారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయానికి కార్య కర్తలు నాయకులు, సమన్వయంతో పనిచేసి.. పటాన్‌చెరు నియోజకవర్గం నుండి రికార్డు మెజార్టీ అందించాలని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ పటాన్చెరు డివిజన్ మరియు పటాన్చెరు మండలాల మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు



చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న లోక్ సభ ఎన్నికలు ఇటు రాష్ట్రానికి అటు బిఆర్ఎస్ పార్టీకి కీలకమని తెలిపారు. పార్లమెంట్లో తెలంగాణ వాదం బలంగా వినిపించాలన్నా.. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలపై ప్రశ్నించాలన్నా బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పటాన్చెరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి మూడుసార్లు బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించిందని, ఇదే స్ఫూర్తితో లోక్ సభ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త పనిచేయాలని కోరారు. ప్రతి పార్టీలో లోటు పాట్లు ఉండడం సహజమని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇవి సెమీఫైనల్స్ లాంటివని తెలిపారు. బూత్ స్థాయి నుండి ప్రణాళికబద్ధంగా పనిచేసి, ఓటర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఆవశ్యకతను వివరించాలని కోరారు. మాజీ కలెక్టర్, సమర్థుడైన బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి లాంటి వ్యక్తిని పార్లమెంటుకు పంపిస్తే, మెదక్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపచేస్తారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు 100 కోట్ల రూపాయలతో పేద ప్రజల కోసం ట్రస్ట్ ఏర్పాటు చేయబోతున్నట్లు ఇప్పటికే ఆయన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పార్టీ మండల అధ్యక్షులు పాండు, డివిజన్ అధ్యక్షులు అఫ్జల్, ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి యాదమ్మ, సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మెరాజ్‌ఖాన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెదక్ గడ్డపై చరిత్ర తిరగరాయాలే..

- పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ముఖ్య నేతల సన్నాహక సమావేశంలో జగ్గారెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు



పార్లమెంట్ ఎన్నికల్లో 25 ఏండ్ల చరిత్రను తిరగరాయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజును గెలిపించి, అన్ని పార్టీలను కంగు తినిపించాలని సూచించారు. ఈ పార్లమెంటు ఎన్నికలు ఛాలెంజ్ గా తీసుకుని సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. చిట్కుల్‌లోని అభ్యర్థి క్యాంప్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ముఖ్యనేతల సన్నాహకసమావేశానికి జగ్గారెడ్డి హాజరై మాట్లాడారు. నీలం మధును గెలిపించుకుని, బీజేపీని ఖతం పట్టించాలన్నారు. ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. ముఖ్య నేతలంతా కిందిస్థాయి నాయకులను సమన్వయం, కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు, దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయితే అమలు చేసే సంక్షేమ అభివృద్ధి పథకాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచిం చారు. టీఎస్ఐఐసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సిద్దిపేట పూజల హరికృష్ణ, గజ్వేల్ ఇన్చార్జి నర్సారెడ్డి, నర్సాపూర్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, దుబ్బాక ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, పటాన్ చెరు ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఎలక్షన్ రెడ్డి, ఎన్నికల కోఆర్డినేటర్ అశోక్ గౌడ్, మహిళా నాయకురాలు సుహాసిని, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఎంపీగా గెలిపిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తానని మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. కాగా ఆయనకు రోజు రోజుకి ప్రజల నుంచి మద్దతు పెరుగుతుంది. ఈ నేపథ్యంలో సోమవారం పలు గ్రామాలు, పట్టణాల నుంచి పలువురు ఆయన క్యాంప్ కార్యాలయానికి వచ్చి.. ఘనంగా శాలువాలతో సన్మానించి, సంఘీభావం తెలిపారు. సంగారెడ్డికి చెందిన లావణ్య, జిన్నారం శ్రీనివాస్, బోరబండ కే ఎస్ నగర్ నుంచి సురేష్, బిఎస్ఆర్ టౌన్ షిప్ నుంచి ఇంద్రేశం, వేలిమల తండ నుంచి భాస్కర్, గణపురం నుంచి వెంకటేశం, కొడకంచి నుంచి సత్యనారాయణ, ప్రశాంత్, వెంకటాపూర్ అగ్రహారం నుంచి నీలగిరి గౌడ్, గుమ్మడిదల నుంచి శ్రీకాంత్ తదితరులు తమ తమ అనుచరులతో నీలం మధును కలిసి సంపూర్ణం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పేదింటి, బీసీ బిడ్డనైనా తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

గీతం స్కాలర్ రాఘవేందర్ ఆవులకు పీహెచ్‌డీ

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి రాఘవేందర్ ఆవుల డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'మైక్రోవేవ్ అసిస్టెడ్, ఉత్ప్రేరకం-రహిత సంశ్లేషణ, ఇండోలిల్-క్రోమెనో నూతన హైబ్రిడ్ మాలిక్యూల్స్ - పిరిడిన్, పైరజోలోన్, క్రోమ్నో అనలాగ్, యాంటీ-మైక్రోబియల్ యాక్టివిటీ కోసం వాటి బయోలాజికల్ మూల్యాంకనాలు' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ బాబు హరిదాస్యం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం నూతన హెటెరోసైక్లిక్ సమ్మేళనాల సంశ్లేషణ, వాటి జీవసంబంధ కార్యకలాపాల మూల్యాంకనమని తెలిపారు. నూతన బహుళ భాగాల ప్రతిచర్యలు అభి వృద్ధి చేసి, ఆమోదయోగ్యమైన ప్రతిచర్య విధానం ప్రతిపాదించా మన్నారు. సంశ్లేషణ చేసిన ఉత్పన్నాలు వాటి యాంటీమైక్రోబయల్ కార్యకలాపాల కోసం మూల్యాంకనం చేశామని, డాకింగ్ అధ్యయనాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సమ్మేళనాలు కొత్త యాంటీ బాక్టీరియల్ ఆవిష్కరణలకు ఉపయోగకరమైన ప్రధాన అణువులుగా ఉపయోగపడతాయన్నారు. రాఘవేందర్ సవ ఎర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ డీ పట్టాకు అర్హత సాధిం చడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించారు.

పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్ మండలంలోని ఖానాపూర్ (కె)తాండాకు చెందిన వాసురాం నాయక్ కూతురి మరియు అలీఖాన్‌పల్లి గ్రామానికి చెందిన కిషన్ నాయక్ కుమారుడు బన్సీలాల్ వివాహం సోమవారం జరిగింది. ఈ వివాహ కార్యక్రమాలకు నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన పత్తిగారి అంజయ్య గారి కుమారుని వివాహం మాసన్‌పల్లి వెంకటాద్రి ఫంక్షన్‌హాల్‌లో జరగ్గా.. ఈ వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూతురు మహారెడ్డి శ్రేయరెడ్డి, జెడ్పిటిసి నరసింహారెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు రామ్‌సింగ్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు దుర్గారెడ్డి, మాజీ సర్పంచ్ లు కిష్టారెడ్డి, గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ అంజయ్య సాగర్,నాయకులు శ్రీనివాస్ గౌడ్, మోహన్, ప్రశాంత్ సాగర్, మల్లేష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పార్లమెంటుపై బీఆర్ఎస్ గెలుపు తథ్యం

నవతెలంగాణ-జోగిపేట



జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ గెలుపు తథ్యమని మాజీ మార్కెట్ చైర్మెన్‌లు డిబి నాగభూషణం, ఎం.మల్లికార్జున్, మాజీ ఎంపీపీ రామగౌడ్‌లు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో ఆందోలు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌కు ఎక్కువ మెజార్టీ వచ్చే విధంగా పార్టీ కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ఆందోలు నియోజకవంలోని కొంతమంది బీఆర్ఎస్ గుర్తుపైన గెలిచిన ప్రజాప్రతినిధులు పదవులకు రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో నిలబడి ప్రజాక్షేత్రంలోకి రావాలని సవాల్ విసిరారు. నేటి నుంచి ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అందోలు-జోగిపేట మున్సిపల్ పరిధిలో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వీరభద్రరావు, చాపల వెంకటేశం, సంతోష్, మహేష్ యాదవ్, బిర్ల శంకర్, నాయికోటి అశోక్, ఉస నాగరాజు, సుధాకర్ గౌడ్, రొయ్యల సత్యం, వడ్ల శ్రీనివాస్, .గోరే, సాయిలు, శంకర్, సంతోష్, మల్లేశం, పి.రమణ, విజయ్ కుమార్, నాగరాజు తదితరులు పాలుగొన్నారు.

వేసవిలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్



వేసవి సెలవుల్లో ఇంటి దగ్గర ఉండే చిన్నారులను వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని రేజింతల్ పాఠశాల హెచ్ఎం సఫీయా సుల్తానా అన్నారు. సోమవారం రేజింతల్ ప్రాథమిక పాఠశాల 1 - 5 తరగతి 120 మంది విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఇంటి దగ్గర ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు.



విజేతలకు బహుమతులు..

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పంచాయతీ గ్రామమైన సోలక్‌పల్లిలో నిర్వహించిన చత్రపతి శివాజీ క్రికెట్ టోర్నీ సోమవారం ఘనంగా ముగిసింది. ఈ మేరకు విజేతలకు సంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు వి ప్రతాపరెడ్డి, పార్టీ జిన్నారం మండలాధ్యక్షులు కొత్త కాపు జగన్‌రెడ్డిలు బహుమతులు అందజేశారు. 18 జట్లు పాల్గొన్న చత్రపతి శివాజీ టోర్నమెంట్లో ప్రథమ స్థానం రాళ్లకత్వ దక్కించుకోగా రన్నర్ అప్‌గా ఊట్ల గ్రామం నిలిచింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వి. ప్రతాప్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి తోపాటు మండల ప్రధాన కార్యదర్శి వై. వెంకటేష్, శక్తి కేంద్రం ఇంచార్జి వెంకటేష్,భూత్ అధ్యక్షులు కె. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు ఎంపికైన బూరుగుపల్లి విద్యార్థులు





నవతెలంగాణ-హవేలీ ఘనపూర్
తెలంగాణ గురుకుల పాఠశాల ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఏడుగురు విద్యార్థులు ప్రవేశం పొందారు. సోమవారం మండల పరిధిలోని బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు 5వ తరగతి పరీక్షల్లో సీట్లు పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమృత తెలిపారు. బూరుగుపల్లి పాఠశాల నుంచి సీట్లు పొందిన విద్యార్థులు పొట్టేళ్ల వేదాక్షరి, ఉప్పరి దీక్షిత, కప్పల రుచిత, లెంక తేజస్విని, సాల రవి కిషోర్, రామావత్ మహేష్, మంగలి శివ గురుకుల పాఠశాలలో సీట్లు పొందారు. ఏడుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీట్లు సాధించడం పట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల్ మీరా, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

మెదక్‌లో 7 నామినేషన్లు



నవతెలంగాణ-మెదక్
లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియలో భాగంగా మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థానానికి పోటీ చేసేందుకు సోమవారం 7 నామినేషన్లు దాఖలయ్యాయి. మెదక్ కలెక్టరేట్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నామినేషన్లను స్వీకరించారు. తుపాకుల మురళీకాంత్ (తెలంగాణ రాజ్య సమితి), తుమ్మల పల్లి పృథ్వీరాజ్ (2వ సెట్) డి.శ్రీశైలం (2వ సెట్), వరి కోలు శ్రీనివాస్, ఎడ్ల కుమార్, కె. లక్ష్మీనారాయణ, మైసగారి సునీల్ (ఇండియా ప్రజా బంధు పార్టీ) నామినేషన్ వేశారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ





నవతెలంగాణ-మనోహరాబాద్
మున్సిపల్‌లోని వార్డులలో ఉన్న సమస్యలను తెలుసుకుని అప్పటికప్పుడే పరిష్కరించి ఆదర్శ మున్సిపల్‌గా తీర్చిదిద్దనున్నట్టు తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ మామిడ్ల జ్యోతి కృష్ణ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని నాలుగవ, ఒకటి, 12వ వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించనున్నట్టు తెలిపారు. ప్రజలు సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. తూప్రాన్ మున్సిపల్‌ను ఆదర్శ మున్సిపల్‌గా తీర్చిదిద్దనున్నట్టు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆర్ శ్రీశైలంగౌడ్, జమాల్‌పూర్ లక్ష్మి నర్సోజి, హైదర్‌గూడ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

24 నుంచి పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణం





నవతెలంగాణ-నిజాంపేట
మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో పెద్దమ్మ పెద్దిరాజుల ద్వితీయ వార్షికోత్సవం ఈ నెల 24 నుంచి ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు నిజాంపేట మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో గల పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం ఈ నెల 24 నుంచి 26 వరకు కొనసాగుతుందని ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. మొదటవ రోజు పోచమ్మ బోనాలు, రెండవ రోజు పెద్దమ్మ పెద్దిరాజుల పెద్దమ్మ బోనాలు, మూడవరోజు పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. కళ్యాణ అనంతరం దేవాలయం వద్ద బైండ్ల వారిచే గావు పట్టడం ఉంటుందన్నారు. అనంతరం మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సభ్యులు పిట్ల కరుణాకర్, అందే స్వామి, అందే నరేష్, సౌడు స్వామి, మ్యదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



నవతెలంగాణ-నర్సాపూర్
నర్సాపూర్ మండల పరిధిలోని అహ్మద్ నగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రతిష్ఠించనున్న ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నేటి నుంచి ఈనెల 24 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నట్లు నిర్వాకులు తెలిపారు. మొదటిరోజు సోమవారం ఎల్లమ్మ దేవి విగ్రహ ఊరేగింపు మంగళవారం విగ్రహమూర్తుల, మూల మంత్రం హవనము బుధవారం విగ్రహమూర్తుల ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట రేణుక ఎల్లమ్మ దేవి కళ్యాణం, అమ్మవారికి బోనాలు సమర్పించుట తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ మహోత్సవాలకు రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి వస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్
మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పెద్ద శంకరంపేట తహశీల్దార్ గ్రేసీబాయ్ సోమవారం ప్రారంభించారు. రైతులు పండించిన జొన్న పంట ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్, సిఈఓ రవీందర్, ఏఈఓ స్వాతి, ఆర్ఐ శరణప్ప, పిఎసిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన గోడ



నవతెలంగాణ-చిలిపిచెడ్
మండల పరిధిలోని అజ్జమరి గ్రామంలో ఆదివారం కురిసిన వర్షానికి ఇంటి గోడ కూలిపోయింది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మంగలి మల్లయ్య ఇంటిపై గోడ గాలి వానకు కూలిపోయిందని తెలిపారు. బాధితులు మంగలి మల్లయ్య మాట్లాడుతూ నష్టపరిహారం చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్కాని వీరస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలని ఆయన కోరారు.

25న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నర్సాపూర్
నర్సాపూర్ మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదిన ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధులత పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, మండల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

సునీత రెడ్డి అన్నీ తానై

- నాయకులు పార్టీని వీడినా, కార్యకర్తలకు భరోసా

నవతెలంగాణ-నర్సాపూర్
పార్లమెంటు ఎన్నికల్లో ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్ని తానై ఎన్నికల బాధ్యతను ఆమె భుజాలపై వేసుకొని ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు పార్టీని వీడుతున్నప్పటికీ సునీతా రెడ్డి మాత్రం పార్టీలో ఉన్న నాయకులకు, కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ పార్టీ అభ్యర్థికి నర్సాపూర్ నియోజకవర్గం నుంచి ఆధిక్యం అందించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. కొన్ని నెలల కింద జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే సునీత రెడ్డి విజయం కోసం ప్రముఖ పాత్ర వహించారు. ఈ మధ్యకాలంలోనే మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి ఆయన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. అయితే మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ నష్టం జరిగింది. నర్సాపూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి బాటలోనే నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ పార్టీని నాయకులు వీడుతున్నప్పటికీ ఎమ్మెల్యే సునీత రెడ్డి మాత్రం అధైర్య పడకుండా నియోజకవర్గంలో ఉన్న నాయకులకు కార్యకర్తలకు నేనున్నానని భరోసా కల్పిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్ రామ్‌రెడ్డికి నియోజకవర్గం నుంచి ఆదిక్యం అందించేందుకు గట్టి ప్రయత్నాలు సాగిస్తున్నారు. అందులో భాగంగానే నాయకులకు, కార్యకర్తలకు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ ధైర్యం కల్పిస్తున్నారు. మొదటగా సోమవారం బీఆర్ ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి మద్దతుగా మాసాయిపేట మండలంలో ఎమ్మెల్యే సునీత రెడ్డి, నాయకులతో, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు.





బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-వెల్దుర్తి
మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్‌రామ్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా సోమవారం మాసాయిపేట మండలం రామంతపూర్ తాండ, రామంతపూర్ లింగ రెడ్డి పల్లి, మాసాయిపేట్ గ్రామాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి మండలాలకు ఈశాన్యం దిశ నుంచి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మాసాయిపేట మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా , విఠలేశ్వర, శ్రీ రేణుకా మాత ఆలయాలలో, రామంతపూర్ తాండలో సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల పూజారులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. అనంతరం పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మెదక్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పలు గ్రామాల ఓటర్లను కోరారు. గతంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా మొన్నటి వరకు ఎమ్మెల్సీగా పనిచేశారన్నారు. ఆయన ఉమ్మడి జిల్లాలకు సుపరిచితుడేనని మరోసారి గుర్తు చేశారు. కోట్లాది రూపాయలకు వారసుడైన వెంకటరామిరెడ్డి నిరుపేద విద్యార్థుల కోసం కోట్ల రూపాయలు వెచ్చించి ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉన్నత చదువులకు బాటలు వేస్తారన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి గెలిచారన్నారు. గెలిచిన మూడు నెలల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. ఏ ఒక్క పథకాన్ని కూడా పూర్తిగా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రజా పాలనలో మార్పులు తెస్తామని మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మాసాయిపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి. శివంపేట ఎంపీపీ హరికృష్ణ, వెల్దుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మెదక్ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్, మాసాయిపేట మాజీ సర్పంచ్ నాగరాజ్ అశోక్ రెడ్డి, కౌడిపల్లి ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి కోఆపరేటివ్ మెంబర్లు జిల్లా అధ్యక్షులు మన్సూర్ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్ గన్నవరం శ్రీనివాస్ రెడ్డి, మాసాయిపేట మండల పలు గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



సమతుల్య ఆహారమే సంపూర్ణ ఆరోగ్యం

- టీషియన్ దీప్తి

నవతెలంగాణ-మెదక్ టౌన్
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "న్యూట్రిషన్ అండ్ హెల్త్ మేనేజ్మెంట్" పై సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె హుస్సేన్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తూ "మంచి జీవనశైలే మానవునికి ఆరోగ్యరక్ష" అని తెలియజేస్తూ విద్యార్థినీ విద్యార్థులు మంచి ఆహారం తీసుకోవడం వలన అన్ని రంగాలలో చురుకుగా ఉండడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య వక్త డైటీషియన్, యోగా ట్రైనర్ శ్రీమతి దీప్తి మాట్లాడుతూ "సమతుల్య ఆహారమే- సంపూర్ణ ఆరోగ్యం" కాబట్టి అన్ని పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతినిత్యం తీసుకోవాలని, అన్ని కాలాలలో లభించే తాజా ఫలాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని, ఫ్రీజ్ చేసిన ఆహారానికి, బయటి నుంచి లభ్యమయ్యే జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమతుల్య ఆహారం వలన మహిళలు ఆడపిల్లల్లో వచ్చే పి.సి.ఒ.డి, ఒబేసిటీ, మైగ్రేన్ థైరాయిడ్ వంటి వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని వివరించారు. తదుపరి విద్యార్థులు అడిగిన సందేహాలకు సమాధానాలు సలహాలు సూచనలు అందించారు. ఈ సర్టిఫికెట్ కోర్స్ నందు కళాశాలలో చదివే బి.ఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులే కాకుండా ఉత్సాహం కలిగిన కాలేజీతో సంబంధం లేని బయటి విద్యార్థులు, ఇతరులు కూడా వారి పేర్లు నమోదు చేసుకోవచ్చని, ఈ కోర్సు 30 గంటలు లేదా 15 పని దినాలు నిర్వహించబడునని, ఈ కోర్సులో సర్టిఫికెట్ పొందుటకు 70% హాజరు సంబంధిత పరీక్షలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. పరీక్ష థియరీ, ప్రాజెక్టు వర్క్ రూపంలో నిర్వహించబడునని, ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పేర్లను వృక్ష శాస్త్ర విభాగంలో లేదా క్యూఆర్ కోడ్, లింక్ ద్వారా నమోదు చేసుకోవచ్చని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో తరగతుల నిర్వహణ జరుగుతుందని కోర్స్ కన్వీనర్ డా.టి.దినకర్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసి సమన్వయకర్త డా. యస్.తిరుమల్ రెడ్డి, కోర్స్ కో కన్వీనర్స్ మురళి వర్దేల్లి, డా.బి.రాజు, వేణుగోపాలరావు, వినోద్ కుమార్, సుధారాణి, విద్యార్థినీ, విద్యార్థులు, ఇతరులు పాల్గొన్నారు.







ఘనంగా శీతలదేవి మడలేశ్వర కళ్యాణం



నవతెలంగాణ-నిజాంపేట:
మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో సోమవారం రజక కులస్థుల ఆరాధ్యదైవమైన శీతలదేవి మడలేశ్వర స్వామి ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా స్వామి వారి కల్యాణం పురోహితులు వెంకట రామ్మోహన్ శర్మ, వేలేటి రాంమోహన్‌ల చేతుల మీద రజక సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రజక సంఘ సభ్యులు మాట్లాడుతూ నూతనంగా మడలేశ్వర ఆలయాన్ని నిర్మించుకుని పండుగ చేయడం ఆనందంగా ఉందన్నారు. సకాలంలో వర్షాలు కురిసే పాడి పంటలతో గ్రామా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవుణ్ణి కోరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు రాజయ్య, బాల్ ఎల్లయ్య, మల్లయ్య, ముత్తయ్య, చంద్రం,బాలయ్య, భైరయ్య, మల్లేశం, బాబు, రాజు, స్వామి, సురేష్, యాదగిరి, రాజు, రమేష్, తిర్మల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయం

- పార్టీపై బురదజల్లే ప్రయత్నాలను మానుకోవాలి
- రాష్ట్ర నాయకులు ర్యాకల శేఖర్‌గౌడ్



నవతెలంగాణ-మనోహరాబాద్
రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని పార్టీ రాష్ట్ర నాయకులు ర్యాకల శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. పార్టీ ఆదేశాల మేరకు మనోహరాబాద్ మండలంలోని గ్రామాలలో ఎంపీపీ పురం నవనీత రవిముదిరాజ్, ఎంపీటీసి పొట్బొల్ల లత వెంకట్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పురం మహేశ్వర్ ముదిరాజ్‌లతో కలిసి బూత్ కమిటీలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు స్వార్ధ రాజకీయాలతో వారి కాలా దందాను కాపాడుకోవడానికి మాత్రమే పార్టీ మారారని తెలిపారు. కానీ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన తెలంగాణ ఉద్యమంలో నాటి నుంచి ఉన్న నిజమైన కార్యకర్తలు నాయకులు ఇంకా పార్టీలోనే ఉన్నారని తెలిపారు. పార్టీ మారిన కొందరు నాయకులు బీఆర్ఎస్ పార్టీపై అవాకులు చవాకులు దుష్ప్రచారాలు చేయడంతో పాటు పార్టీ కార్యకర్తలను బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాంటి వారు తమ పద్ధతిని మార్చుకోవాలని హితవు పలికారు. మనోహరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయిందంటూ పనికిరాని మాటలు మాట్లాడుతున్నారని, రాబోయే 13న ఏ పార్టీ పోయిందనేది బయటపడుతురందని పేర్కొన్నారు. ప్రజలు ఇంకా బీఆర్ఎస్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులే గుర్తిస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిల్లాలోనే మనోహరాబాద్‌ను మెజారిటీలో అగ్రగామిగా నిలిపేవిదంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్‌గౌడ్, సలీం, శ్రీనివాస్‌గౌడ్, బండారు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

- ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్
పెద్ద శంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సభ్యుల కోరం లేకపోవడం వల్ల సోమవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు పేట ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు దాటినప్పటికీ సభ్యులు కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆమె వివరించారు. త్వరలోనే మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

అంగన్వాడి కేంద్రంలో ప్రీ స్కూల్‌డే స్నాతకోత్సవం

- ప్రీ స్కూల్ పిల్లలకు సర్టిఫికెట్ల పంపిణీ
- ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి

నవతెలంగాణ-వెల్దుర్తి
మండల కేంద్రంలోని చేరిలా గ్రామంలో అంగన్వాడి కేంద్రం-2 లో అంగన్వాడి టీచర్ దేవలత ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ డే స్నాతకోత్సవం, ప్రీస్కూల్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికల వెంకటేశం హాజరయ్యారు. పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి మాట్లాడారు. అంగన్వాడి కేంద్రానికి వచ్చేవారు 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల వరకు పిల్లలు ఉంటారన్నారు. పిల్లలు అభ్యసించిన పాఠ్యాంశాలు శారీరక అభివృద్ధి, సామాజిక, వ్యక్తిగత బావోద్వేగ అభివృద్ధి, మేధో వికాసం, భాషాభివృద్ధి, నేర్చుకునే పద్ధతులను బట్టి వచ్చే విద్యా సంవత్సరానికి ప్రాథమిక పాఠశాలకు పంపడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఏప్రిల్ నెలలో విద్యార్థుల నైపుణ్యతలను బట్టి మార్కులు వేసి ప్రీ స్కూల్ ప్రోగ్రెస్ కార్డ్స్‌తో పాటు గ్రాడ్యుయేషన్ పద్ధతిలో అంగన్వాడి కేంద్రంలో పిల్లల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో పిల్లలకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





మడలేశ్వర కళ్యాణానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిజాంపేట: శీతల దేవిమడలేశ్వర కళ్యాణానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చల్మెడ గ్రామ రజకులు శీతల దేవి మడలేశ్వర విగ్రహ ప్రతిష్టాపన చేసి శీతల దేవి మడలేశ్వర కళ్యాణం జరిపించడం సంతోషంగా ఉందన్నారు. చల్మెడ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో పాడిపంటలతో చల్లంగా చూడాలని ఆ దేవున్ని కోరుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిష్టాగౌడ్, బాల్‌రెడ్డి, భాస్కరరావు, దుర్గయ్య, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాంపూర్ గ్రామంలో హెూమం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం రాంపూర్ గ్రామంలో సీతా రామచంద్రస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. భద్రాద్రి రామయ్య ఆలయం నుంచి తెచ్చిన అక్షింతలతో స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. సోమవారం హెూమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచ్ అనగోని లక్ష్మి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, సొసైటీ చైర్మెన్ కోల రమేష్ గౌడ్,ఉత్సవ కమిటి సభ్యులు,నాయకులు ఆనగోని పర్షరాములు గౌడ్, ఎనగందుల యాదగిరి, మురళి గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్తి దవాఖానాను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

నవ తెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణంలోని కోటమైసమ్మ దేవాలయం వద్ద గల బస్తి దవాఖానాను సోమవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. దవాఖానలో గల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం బస్తీ దవఖాన వైద్యురాలు డాక్టర్ గౌతమిని అభినందించారు. అనంతరం శ్రీనివాస్‌ను గౌతమి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బస్తీ దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తె మట్టెల అందజేత



నవ తెలంగాణ - సిద్దిపేట

మోతే గ్రామానికి చెందిన కుమారి హేమీమా వివాహ నిమిత్తం సిద్దిపేటకు చెంది ఉప్పల శ్రీనివాస్ - అంజమ్మ, దంపతులు సహకారంతో మంగళసూత్రాలు, మెట్టెలు, పట్టు చీర, గాజులు అందజేసినట్లు క్రైస్తవ సంఘం నాయకులు నెలమల్లి సికిందర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ క్రైస్తవ వదువుకు శ్రీనివాస్ పుస్తె మట్టెలు బహుకరించి సమాజంలో మానవత్వం చాటారని అన్నారు. ఈ కార్యక్రమంలో గాడ్ విజన్ అసోసియేషన్ ప్రతినిధులు, అధ్యక్షులు పాస్టర్లు సాగర్, పాల్, నాగరాజు, అబ్రహం, సలోమోనోబాబు పాల్గొన్నారు.

కె.విఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో



రాముని పట్ల కు చెందిన నిరుపేద కుటుంబమైన మేడ స్వరూప - చంద్రం గౌడ్ కుమార్తె సారిక (భార్గవి) వివాహం కోసం కె.వి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు తన వంతు సాయంగా పుస్తె మట్టెలు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎస్ ఎన్ సత్యం, వెంకట్ , భారత్, సురేందర్ గౌడ్, కొండ రాజ్ కుమార్, ఎజాస్ పటేల్, రాముని పట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని దుబ్బాక ఎమ్మెల్యే



బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్

నవతెలంగాణ- దుబ్బాక

కొత్త ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి 5 నెలలు కావస్తున్నా దుబ్బాక నియోజకవర్గానికి 5 సార్లు కూడా రాలేదని, 5 మాసాలుగా ప్రజలకు అందుబాటులో లేరని మాజీ ఎమ్మెల్యే,బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని పలు వార్డుల్లో రఘునందన్‌రావు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. డిపాజిట్ రానోళ్ల కొబ్బరికాయలు కొడుతుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడా గెలవని బీఆర్ఎస్‌కు ఓటేస్తే రామసముద్రంలో వేసినట్లేనన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి ప్రజలలో

ఆదరణ చూచి ఓర్వ లేకపోతున్న ప్రతిపక్షాలు'



నవతెలంగాణ-మర్కుక్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలలో వస్తున్న అదరణను చూచి ప్రతిపక్ష పార్టీలలో వణుకు మొదలైందని కాంగ్రెస్ పార్టీ దామరకుంట గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్ అన్నారు. సోమవారం దామరకుంటలో అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు చూచి ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయడానికి ముందుకు రావడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 10 సంవత్సరాల పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంపై అసత్య ప్రచారాలను మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజును భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్. పరమేశ్వర్, ఎం. బాలరాజు ,బి .రవిగౌడ్ ,బి. కుమార్ యాదవ్ , వి. ఆంజనేయులు యాదవ్, పత్తి శంకర్ యాదవ్ ,సంగం నర్సింలు ముదిరాజ్ తదితరులున్నారు.

ఈ ఎన్నికల్లో వారి ప్రయత్నాలు సాగవు:

బీఆర్ఎస్‌పై రఘనందన్‌రావు మండిపాటు



నవ తెలంగాణ -మిరుదొడ్డి

ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేసే విధంగా డబ్బులు పంపిణీ చేసి శాసనసభ ఎన్నికల్లో గెలుపొందిన కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రయత్నం ఫలించింది ఏమో కానీ... ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం అలాంటి నిర్ణయాలు సాగవబోవని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్న సాగర్ ముంపు ప్రభావిత ప్రాంత ప్రజల నరరూప రాక్షసుడు బిఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవరాజు, బిక్షపతి, మల్లేశం, కనకరాజు, వెంకట్ గౌడ్ పలువురు పాల్గొన్నారు.

సీపీఐ (ఎం-ఎల్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవ తెలంగాణ - సిద్దిపేట



మార్క్సిస్టు మహెూపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ 154వ జయంతి, సిపిఐ (ఎం-ఎల్) 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో వేములవాడ కమాన్ వద్ద సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ సిద్దిపేట డివిజన్ నాయకులు కొడారి యాదగిరి మాట్లాడుతూ 1969 ఏప్రిల్ 22న చంద్ర పుల్లారెడ్డి, చారు మజుందార్, తరిమేల నాగిరెడ్డి, దేవులపల్లి నాయకత్వంలో సీపీఐ(ఎం-ఎల్)పార్టీని స్థాపించారని అన్నారు. పీడుతుల పక్షాన నిలబడి, దొరలు, పటేల్, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసినదని అన్నారు. అదే విధంగా పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్ మాట్లాడుతూ జీతగాళ్ల సమ్మె, కూలిరేట్ల పెంపు, సారా వ్యతిరేక పోరాటాలు జరిగాయని, భూ పోరాటాల ద్వారా లక్షల ఎకరాల భూములను ప్రజలకు పంచిపెట్టిందని అన్నారు. నరేంద్ర మోడీ సబ్కా వికాస్ నినాదం ఒక మాటల గారడి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సిద్దిపేట డివిజన్ కమిటీ నాయకులు కొంపల్లి విజయ్ కుమార్, ఇఫ్టు నాయకులు చంద్రం, పాషా, పివైఎల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.అనిల్, పీ.డీ.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యానాథ్ తదితరులు పాల్గొన్నారు.

నీలం మధు విజయం కోసం కృషి చేద్దాం

నవ తెలంగాణ - సిద్దిపేట



మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, మాజీ టౌన్ అధ్యక్షులు చొప్పదండి చంద్రశేఖర్, జిల్లా ఒబిసి సెల్ అధ్యక్షులు డాక్టర్ సూర్య వర్మ, రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ కోఆర్డినేటర్ దాసరి రాజు అన్నారు. నీలం మధుకు మద్దతుగా డీసీసీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నీలం మధుకు మద్దతుగా పార్లమెంట్ మొత్తం సైకిల్ యాత్ర చేస్తున్న వదిరి సతీష్ ముదిరాజ్ ని కాంగ్రెస్ పార్టీ పక్షాన సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున ముమ్మరంగా ప్రచారం చేసీ భారీ మెజారిటీ తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. రానున్న రెండు మూడు రోజుల్లో నీలం మధు అద్యక్షతన సిద్దిపేటలో భారీ ఎత్తున మీటింగ్ ఉండబోతుం దని తెలిపారు. కార్యకర్తలను దృష్టిలో పెట్టుకొని ప్రతి రోజు జిల్లా కార్యాలయంలో మధ్యాహ్న భోజనాలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.

ప్రజాప్రతినిధులపై నమ్మకంతో... గూడెం బాధితుల దీక్ష వాయిదా

నవతెలంగాణ-బెజ్జంకి



బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన మూడెకరాల భూ పంపిణీలో మాకు అన్యాయం జరిగిందని మండల పరిధిలోని గూడెం గ్రామానికి చెందిన పలువురు బాధితులు అవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ అవరణం వద్ద బాధితులు 41వ రోజు నిరాహార దీక్ష సాగించారు. గత 40 రోజులుగా నిరంతరంగా నిరాహార దీక్ష చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం అసహనానికి గురిచేసిందని బాధితులు వాపోయారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సంబంధిత అధికారులు న్యాయం చేస్తారనే నమ్మకంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనల దృష్ట్యా తాత్కాలికంగా నిరాహార దీక్షను వాయిదా వేస్తున్నామని..ఎన్నికల అనంతరం నిరాహార దీక్షను యథావిధిగా చేపడుతామని బాధితులు తెలిపారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవ వేడుకలు

నవ తెలంగాణ - సిద్దిపేట



పట్టణంలోని శివాజీ నగర్‌లోని బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు పాల్గొని డ్రాయింగ్ ద్వారా మరియు చెట్టు, నీరు, భూమి, ప్లాస్టిక్ భూతముల వేషధారణ వేసి, ఈ భూమికి మనుషులు ఏ విధంగా హాని కలిగిస్తున్నారో వివరించారు. భూమిని ఎలా మనం కాపాడుకోవాలో చక్కని సందేశాన్ని అందరికీ తమ ప్రదర్శన ద్వారా తెలిపారు. అనంతరం సంస్థ నిర్వాహకులు బి కే భవాని మాట్లాడుతూ పిల్లలకు బాల్యం నుండే పర్యావరణాన్ని కాపాడుకునే విధానాలను తెలియజేయాలని, బ్రహ్మ కుమారీస్ వారు ఇలాంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ పిల్లలని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

సిద్దిపేట జిల్లా డిపిఓ దేవకీదేవి

నవతెలంగాణ-మద్దూరు



గ్రామాలలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని సిద్దిపేట జిల్లా డిపిఓ దేవకిదేవి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీరు శానిటేషన్‌పై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆమె అధికారులను ఆదేశించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, ఎంపీఓ కాజా మొయినుద్దీన్, పాల్గొన్నారు.

జాతరోత్సవాల్లో శ్రమదానం

నవతెలంగాణ-బెజ్జంకి



శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సాలు మండలంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన పలువురు అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు సోమవారం ఆలయం అవరణం వద్ద శ్రమదానం చేశారు.

గరుడా వాహనంపై ఊరేగింపు..

మండల కేంద్రంలోని ఆలయ భక్త బృందం సోమవారం లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాలను గరుడా వాహనంపై ప్రధాన వీదుల్లో ఊరేగించారు.ఏఎంసీ మాజీ చైర్మన్ అక్కరవేణీ పోచయ్య,ఐలేని శ్రీనివాస్ రెడ్డి,అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు రూ 50 వేల విరాళం

నవతెలంగాణ -గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో జరగనున్న వీర హనుమాన్ విజయోత్సవ శోభాయాత్రకు ఎఫ్ డి సి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి రూ 50 రూపాయలు విరాళం ఇచ్చారు. ఆదివారం స్థానిక వీర హనుమాన్ సంఘం నాయకులు ఆయనను కలవడంతో విరాళం అందించారు..

కొండగట్టు బయలుదేరిన హనుమాన్ మాలాధారణ స్వాములు



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రం నుండి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి మాల విరమణ కోసం హనుమాన్ మాలాధారణ స్వాములు సోమవారం కొండగట్టు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పానుగంటి తిరుపతయ్య మాల ధరణ స్వాములకు హనుమాన్ దేవాలయంలో ఇరుముడి కట్టారు.

దమ్మక్క పల్లి పాఠశాలలో వార్షికోత్సవం వేడుకలు



నవ తెలంగాణ - కొండపాక

కొండపాక మండలం దమ్మకపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం వార్షికోత్సవ వేడుకలు జరిగాయి . ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందన్నారు. ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

బైరాన్ పల్లి లో దుర్గమ్మ ప్రతిష్టాపోత్సవం ప్రారంభం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామంలో దుర్గమ్మ ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు పార్నంది ఆంజనేయ శర్మ, ఆధ్వర్యంలో గణపతి పూజ పుణ్యావచనం నవగ్రహ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బిఆర్ఎస్ దూల్మిట్ట మండల ఉపాధ్యక్షుడు ఇమ్మడి సంజీవరెడ్డి, ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తిగుళ్ల రామ్మూర్తిశర్మ, రవీందర్ శర్మ, ప్రశాంత్ శర్మ, ఎంపీటీసీ నందన బోయిన నర్సింలు, మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణంపై పోలీసుల దాడి

సుమారు 6 లీ.మద్యం స్వాదీనం

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో బెల్ట్ దుకాణంపై సోమవారం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. స్థానిక బెల్ట్ దుకాణం నిర్వహాకుడు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి మద్యం విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి సుమారు 6 లీ.మద్యం స్వాదీనం చేసుకున్నామని ఎస్ఐ క్రిష్టారెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతుల్లేకుండా మద్యం విక్రయాలు సాగిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వేసవి సెలవుల్లో విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలి



నవ తెలంగాణ - కొండపాక

వేసవి సెలవుల్లో విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని కొండపాక మండలం దుద్దెడ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహ చారి తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థులకు 30 రోజుల విద్యా ప్రణాళిక అప్పగించినట్లు తెలిపారు. తెలుగు హిందీ ఇంగ్లీష్ సబ్జెక్టులలో చదవడం రాయడం నేర్పివ్వాలని తెలిపారు. ఎండలో తిరగనివ్వకుండా అలాగే ఈతకు వెళ్లకుండా చూసుకోవాలని తెలిపాడు. సెల్ ఫోన్ లకు దూరం ఉంచాలని తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ నర్సింలు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం | 23 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

ప్రమాదంలో ఉన్న రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

డి.బి.ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్



నవతెలంగాణ-మిర్‌దొడ్డి

ప్రజలందరికీ స్వేచ్ఛ ,సమానత్వం, సోదరభావం, సామాజిక ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందిస్తున్న భారత రాజ్యాంగాన్ని మార్చే శక్తుల కుట్రలను అంబేద్కర్ ఇచ్చిన ఓటు ఆయుధం తో తిప్పికొట్టాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్అన్నారు.సోమవారం నాడు మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో ఉపాధి హామీ సందర్శించి కూలిలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా భీమ్ శేఖర్ మాట్లడుతూ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి %శీటీం% ప్యాకెట్లు పంపిణీ చేసి వారి సమస్యలు తెలుసుకోవడం జరిగింది.భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమం కరపత్రాలను అవిష్కరించారు.పీఠిక ప్రతి పాఠశాలలో చదివించాన్నారు,పాఠ్యపుస్తకాలలో వేయాలి.రాజ్యాంగాన్ని తప్పకుండా రక్షించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

అఖిల్‌ను సత్కరించిన అంబేద్కర్ సంఘం సభ్యులు



నవతెలంగాణ - కొండపాక

సివిల్ సర్వీస్ ర్యాంకు సాధించిన బుద్ధి అఖిల్ ను కొండపాక అంబేద్కర్ సంఘం సభ్యులు సోమవారం శాలువాతో సత్కరించారు. అఖిల్‌తో పాటు ఆయన తండ్రి నరేష్ ను సత్కరించారు. అఖిల్ నుంచి యువత ఎంతో నేర్చుకోవాలని అంబేద్కర్ సంఘం నాయకులు పేర్కొన్నారు కార్యక్రమంలో విజయ్ కుమార్, పర్శరాములు , బాల కిషన్ , దర్గయ్య , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు నడుం బిగించాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

ప్రభుత్వ పాఠశాలను ప్రజలు కాపాడుకోవాలని, ఇందుకోసం ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని, మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. మండల టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు, ముస్త్యాల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కరెడ్ల రాజిరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం మండల పరిధిలోని ముస్త్యల పాఠశాలలో సోమవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, పిల్లలకు మెరుగైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పాఠశాలలకు మౌలిక సదుపాయ కల్పనలో భాగస్వామ్యం కావాలని, పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చొరవ చూపాలని పిలుపునిచ్చారు. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ కరెడ్ల రాజిరెడ్డి 34 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా సేవలందించి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని, టీఎస్ యుటిఎఫ్ సంఘ నాయకునిగా ఎన్నో పోరాట కార్యక్రమాల్లో పాల్గొని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని" కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలిహమ్మద్, తప్పెట్ల యాదగిరి, జనగామ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి. చంద్రశేఖర రావు, ఏ. శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాదగిరి, మేరీ సుజాత, జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి మేర్గోజు మల్లేశం, చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని అభినందనలు తెలిపారు.

25న సిద్దిపేటకు అమిత్ షా రాక



నవ తెలంగాణ - సిద్దిపేట

ఈనెల 25న సిద్దిపేట పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభకు బిజెపి జాతీయ నాయకులు అమిత్ షా హాజరుకానున్నట్లు మెదక్ బిజెపి పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కూడా హాజరవుతారని అన్నారు. తనను గెలిపిస్తే 100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తానన్న బిఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి మూడు సంవత్సరాలుగా ఎమ్మెల్సీ పదవిని అనుభవిస్తున్నాడని, ఎక్కడ తన నిధులు ఖర్చు చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు శంకర్, మార్కండేయులు, నరేష్ , వేణు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ విజయం ఖాయం

: వంటేరు, రాజమౌళి



నవతెలంగాణ- గజ్వేల్

పార్లమెంటు ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయం ఖాయమని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు, ఆదివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని తొమ్మిదవ వార్డు అధ్యక్షులుగా మామిడి శంకర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ నాయకత్వంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నవాజ్ , కౌన్సిలర్లు చందు, శ్రీధర్, ఉమర్, రవీందర్, నర్సింగరావు, మల్లేశం గౌడ్, కరీం, బాకీ స్వామి తదితరులు ఉన్నారు.

కేంద్రపథకాలపై ప్రచారం



నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందని బిజెపి నాయకులు బండారు మహేష్ అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో కేంద్ర పథకాలపై ప్రచారం చేశీరు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సాయి కిరణ్, అశోక్ గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, కుమార్, అరవింద్, ఆనంద్, సాయి గౌడ్, రాజు, వినయ్, శివకుమార్, శరత్, లక్ష్మణ్, చందు, దయానంద్ నవీన్,తదితరులు పాల్గొన్నారు

ఎక్కడి నుండైనా పోటీ చేయవచ్చు

నవ తెలంగాణ-రాయపోల్



బిజెపి మెదక్ పార్లమెంట్ అభ్యర్థి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావును దుబ్బాక ప్రజలు తిరస్కరిస్తే మెదక్ లో పోటీ చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించడం సరైనది కాదని బిజెపి ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు పుట్ట కరుణాకర్ అన్నారు. భారతదేశంలో పార్లమెంట్ ఎన్నికలలో ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసే అర్హత భారత రాజ్యాంగం కల్పించిందన్నారు.

మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో... జొన్న కొనుగోళ్లు

- మండలంలో జొన్న సాగు విస్తీర్ణం 3022 ఎకరాలు
- ఎకరాకు 8 క్వింటాల చొప్పున కొనుగోలు
- కష్టపడి పండించిన రైతులకు గిట్టుబాటు ధర
- ప్రైవేటు వ్యాపారుల మోసాలకు అడ్డుకట్ట





నవతెలంగాణ - ఝరాసంగం

ప్రభుత్వం అన్నదాతలకు తీపి కబురు అందించి వేసవిలో చల్లగా ఆదుకుంటుంది. మండలంలో రైతులు సాగు చేసిన జొన్న పంట చేతికి వస్తోంది. ఈ సీజన్లో మండలంలో జొన్న పంటను రైతులు ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. దీనితో మార్కెట్లోకి భారీగా జొన్న పంట తరలి వస్తుంది. ప్రభుత్వం కూడా ఈ జొన్న పంటకు మద్దతు ధర ప్రకటించి వ్యవసాయ శాఖ,మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఝరాసంగం, ఏడాకుల పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మార్కెట్ ధర కంటే అధికంగా ఉంది. కాబట్టి రైతులు నేరుగా ప్రభుత్వానికి జొన్నలను అమ్ముతున్నారు. అధిక మద్దతు ధర ఉండడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటా జొన్నల కు మద్దతు ధర రూ.3180 అందిస్తుంది.

అక్రమాలను అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు

ప్రభుత్వం అక్రమాలను అడ్డుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ముందుగానే జొన్న పంట సాగు చేసేవారి రైతుల వివరాలను నమోదు చేసుకుంది. దీనితో అధికారులు అందరి దగ్గర జొన్నలు కొనుగోలు చేయకుండా వివరాలను నమోదు చేసిన రైతుల వద్దనే కొనుగోలు చేయాల్సి ఉంది.దీనితోపాటు జొన్న రైతులకు మద్దతు ధరను ఇచ్చేందుకు మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం జోన్నలను కొంటున్నారు. జొన్న కొనుగోళ్ల సాఫీగా జరగడానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. దీనితో మార్కెట్లో విక్రయాలు సజావుగా కొనసాగుతున్నాయి. ఈ సంవత్సరం మండలంలో ఏకంగా 2081 మంది రైతులు 3022 వేల ఎకరాల్లో అధికంగా జొన్న పంట సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం కొంత పంట అకలా వర్షాలకు నేలకొరిన పూర్తిగా వాతావరణం అనుకూలంగా ఉండడంతో పంటకు అధిక దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

రైతులు జొన్న పంట సాగు చేసినట్లు ఆన్లైన్లో పొందుపర్చిన సర్వేలో పేరుంటేనే రైతు నుంచి కొంటున్నారు. అధికారులు ఒక్కో రైతు నుంచి ఎకరాకు 8 క్వింటాళ్ల జొన్న పంట కొనుగోలు చేయాలని పరిమితి పెట్టారు. మార్కెట్లో క్వింటా ధర తగ్గిపోగా, ప్రభుత్వ మద్దతు ధర రూ.3180 చెల్లిస్తుంది. గతంలో వ్యాపారులు అడ్డగోలుగా రైతుల నుంచి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రాలకు రైతులు విక్రయిస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

రైతులు పండించిన పంటకు సరైన నాణ్యతను పాటించి సరైన విధంగా ధరను పొందడానికి ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. ఇందులో కొన్ని ముఖ్యమైన ప్రమాణాలు

1. మలినాలు (మట్టిపెళ్ళలు,రాళ్ళు)-2.0
2. విడిపోయిన పగులు చెందిన ధాన్యాలు-1.0
3. దెబ్బతిన్న, రంగు మారిన ధాన్యాలు-2.0
4. పరిపక్వతలేని, కుంగిపోయిన ధాన్యాలు-3.0
5. తేమ-14.0 గరిష్ట శాతంగా ఉండాలి.

రైతుల ఖాతాలలో డబ్బులు జమ కావడానికి తగిన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అవి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి 1.పంట సాగు ధ్రువీకరణ పత్రం2. రైతు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ 3. బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ 4. ఆధార్ కార్డు పత్రాలను విక్రయ సమయంలో సమర్పించాలి.



రైతులు సద్వినియోగం చేసుకోవాలి

గౌసొద్దిన్ ప్యాక్స్ చైర్మెన్, ఝరాసంగం

మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో జొన్న పంటను కొనుగోలు చేస్తున్నాం.రైతులు నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగ పాటించి కొనుగోలు కేంద్రాలకు సరుకు తీసుకు రావాలి. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ - జగదేవపూర్

జగదేవపూర్ పరిదిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం నాడు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కేశిరెడ్డి రవీందర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ ఛైర్మెన్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డిసిసి బాధ్యులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రవీందర్ రెడ్డి, సీతమ్మగారి చంద్రారెడ్డి, తోట భగవాన్ రెడ్డి, చెక్కల సుధాకర్, జొన్న శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి ఎంపిటిసి మహేష్ యాదవ్, నాయకులు మహిపాల్ రెడ్డి, రమేష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని 20వ వార్డుకు చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మహమ్మద్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో ఇంచార్జి హరికృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎంపీ ఎలక్షన్స్ లో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని, అందుకోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, పట్టణ అధ్యక్షులు అత్తు, కౌన్సిలర్లు సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, రియాజుద్దీన్, సేవాదళ్ స్టేట్ కన్వీనర్ గుర్రం శ్రీనివాస్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డ్ క్యాసారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు క్యాసారం కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నుండి దాదాపు 200 మంది గజ్వేల్‌లో సోమవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొండల్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కోసం ఎంతో కష్టపడినా తమకు పార్టీలో గుర్తింపు లేదని మా క్యాసారం గ్రామాన్ని పట్టించుకున్న నాథుడే లేడన్నారు. మనస్థాపం చెంది కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు తెలిపారు. మెదక్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నీలం మధు గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, నరేందర్ రెడ్డి, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్న గారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, మల్లారెడ్డి,సయ్యద్ బాబా,బి ఆర్ ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన మహేష్, సిరియాల్,సుదర్శన్, పర్శరాములు,సాదుల్,యాదగిరి,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.







ఉత్పత్తులను పరిశీలించిన చేనేత కమిషనర్

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేటలోని పలు చేనేత సహకార సంఘాలలో ఉత్పత్తి చేస్తున్న వస్త్ర ములను తెలంగాణ చేనేత కమిషనర్ అలుగు వర్షిని, జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్‌తో కలిసి సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న చేనేత ఉత్పత్తులను పరిశీలించి, చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. సంఘంలో నేసిన ఉత్పత్తుల ను రామప్ప సిల్క్ చీరలు, గొల్లభామ చీరలు నేసిన వస్త్రాలను పరిశీలించి త్వరలో కొనుగోలు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లా డుతూ కొత్తగా 100 నంబర్ గల నూలుతో నూతనంగా వస్త్రములు, చీరలు తయారు చేయాలని కార్మికులకు సూచించినారు. ఈ కార్యక్రమంలో చేనేత రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ అశోక్ , ట్రిస్కో డిపార్ట్మెంట్ రతన్ కుమార్ , సిద్దిపేట జిల్లా హాండ్లు ఏడి సంతోష్ కుమార్, ఏడిఓ ప్రవీణ్ రెడ్డి, ముదిగొండ శ్రీనివాస్, గుండు రవితేజ, చేర్యాల మల్లికార్జున్, గోవర్ధన్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



బస్సును ఢీ కొట్టిన లారీ, ముగ్గురికి గాయాలు

నవ తెలంగాణ - కొండపాక





కొండపాక గేటు వద్ద రాజీవ్ రహదారిపై ఆర్టిసి బస్సును లారీ ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కరీంనగర్ డిపో ఆర్టీసీ బస్సును కొండపాక గ్రామం నుంచి రాజీవ్ రహదారి వైపు వస్తున్న లారీ ఢీ కొట్టింది. దాంతో బస్సు డ్రైవర్ తో పాటు ఇద్దరి ప్రయాణికులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ చేరుకొని స్థానికుల సహాయంతో బస్సులో ఇరుక్కపోయిన డ్రైవర్ లక్ష్మయ్యను బయటకు తీసి అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు శ్రీలత, దిలీప్ లకు స్వల్ప గాయాలు కావడంతో అక్కడే ప్రథమ చికిత్స చేసి పంపించారు.



